# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 31 | పేజీలు: 4 | వెల: 4/- | సోమవారం ● 19, ఆగస్టు 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## జూరాలకు మళ్లీ పెరిగిన వరద



**గద్వాల,ఆగస్టు18(నమస్తే ఉదయం):** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం మళ్లీ పెరిగింది. నీటి ప్రవాహం తగ్గడంతో వారం రోజుల క్రితం గేట్లు మూసివేయగా..మూడు రోజుల నుంచి జూరాలకు వరద ప్రవాహం పెరిగింది. ఆదివారం రాత్రి 9.45 గంటల సమయంలో ప్రాజెక్టుకు 54,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా..అయిదు క్రస్టు గేట్ల ద్వారా 20,865 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేశారు. అదేవిధంగా 5 యూనిట్లలో విద్యుదుత్పత్తి కోసం 40,340క్యూసెక్కులు వదులుతుండగా.. మొత్తంగా జూరాల నుంచి 64,515 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా...ప్రస్తుతం 9.480 టీఎంసీలుగా ఉంది.

# విద్యుత్ శాఖలో భారీ స్థాయిలో పదోన్నతులు

**సంతోషం వ్యక్తం చేసిన ఉద్యోగులు**

**గత పదేళ్లలో మాకు అన్యాయం జరిగింది**

**సీఎం, డిప్యూటీ సీఎం లకు ధన్యవాదాలు తెలిపిన ఉద్యోగులు**

**2017 నుండి పెండింగ్‌లో వున్న పదోన్నతులకు ఈరోజు మోక్షం...**

**పదోన్నతుల వలన ఏర్పడిన ఖాళీల భర్తీకి నిర్ణయం తీసుకునే అవకాశం..**



విద్యుత్ శాఖలో పదోన్నతులు ఇచ్చిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సిఎండి ముషారఫ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

**హైదరాబాద్, ఆగస్టు18(నమస్తే ఉదయం)**

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చరిత్రలో మొట్ట మొదటిసారిగా ఒకే రోజులో భారీ స్థాయిలో 2263 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ముషారఫ్ ఫరూఖీ ఐఏఎస్ ఆదేశాలు జారీ చేసారు. ఇంజినీరింగ్ సర్వీస్ లో 101, అకౌంట్స్ సర్వీస్‌లో 47, ఓ అండ్ ఎం సర్వీస్ లో 2099, పి అండ్ జిసర్వీస్‌లో 16 మంది అధికారులు, సిబ్బందికి పదోన్నతులు లభించాయి.

ఉప ముఖ్య మంత్రి , తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ నెల 8 వ తేదీన దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

ఆ సమీక్షాలో పాల్గొన్న పలువురు అధికారులు 2017 నుండి పెండింగ్‌లో వున్న పదోన్నతుల గురించి ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్క దృష్టికి తీసుకురావడం జరిగింది. ఎన్నో ఏళ్లుగా పదోన్నతులకు నోచుకోని ఉద్యోగుల నైతిక స్థైర్యం దెబ్బతింటున్న విషయాన్ని గ్రహించిన ఉప ముఖ్య మంత్రి పెండింగ్‌లో వున్న పదోన్నతులకు సంభందించిన కార్యాచరణను వెంటనే ప్రారంభించాల్సిందిగా సీఎండీ ముషారఫ్ ఫరూఖీని ఆదేశించారు.

వాస్తవానికి 2017 నుండి పదోన్నతులు పెండింగ్‌లో ఉండటం మూలంగా, అర్హులైన చాలామంది పదోన్నతులు పొంద కుండానే రిటైర్ అయ్యారు. 2263 మంది సిబ్బందికి పదోన్నతుల వలన ఖాళీ అయిన పోస్టుల భర్తీకి సైతం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలననుసారం చర్యలు తీసుకుంటామని సీఎండీ తెలిపారు.

2017 నుండి, అంటే దాదాపుగా ఏడున్నరేళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు భారీ స్థాయిలో పదోన్నతులకు ఆమోదం తెలిపి అదేశాలు ఇప్పించిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , సంస్థ సీఎండీ లకు విద్యుత్ ఉద్యోగులు అధికారులు పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని తెలియజేసారు.





## అభిషేక్ మను సింఘ్వీ రాజ్యసభ అభ్యర్థిత్వానికి

# ఓకే చెప్పిన సీఎల్పీ..

**హైదరాబాద్,ఆగస్ట్ 18 (నమస్తే ఉదయం):**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నానక్ రామ్‌గూడలోని హొటల్ షెరటాన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం ముగిసింది. సమావేశానికి పెద్దఎత్తున మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకాగా వారికి రాజ్యసభ కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వీని రేవంత్ రెడ్డి పరిచయం చేశారు. సింఘ్వీ అభ్యర్థిత్వానికి సీఎల్పీ నేతలు మద్దతు తెలపగా.. వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా సింఘ్వీని ఆమోదించినందుకు అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలుపుతూ సీఎల్పీ తీర్మానం చేసింది.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..”ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం అమలులో అనేక రాజ్యాంగ, న్యాయపరమైన చిక్కులు, అవాంతరాలు ఉత్పన్నమయ్యాయి. 2014 పునర్విభజన చట్టాన్ని పదేళ్లపాటు కేంద్రం అమలు చేయలేదు. ఆ చట్టంలోని అంశాలను చట్టసభలతోపాటు సుప్రీంకోర్టులో బలంగా వినిపించాల్సిన అవసరం ఉంది. అందుకే రాజ్యాంగ, న్యాయ కోవిదుడు అభిషేక్ మను సింఘ్వీని తెలంగాణ నుంచి రాజ్యసభకు పంపాలని అధిష్ఠానాన్ని కోరాం. అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం చట్టసభలు, న్యాయస్థానాల్లో ఆయన గట్టిగా వాదనలు వినిపిస్తారు. మాజీ ఎంపీ కేకే పెద్దమనసుతో క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తగా వ్యవహరించారు. తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా సింఘ్వీ పేరు ప్రతిపాదించిన వెంటనే ఆమోదించినందుకు కాంగ్రెస్ అధిష్ఠానానికి ధన్యవాదాలు” అని చెప్పారు.

అభిషేక్ మను సింఘ్వీ రాజ్యసభ ఎంపీ కావడం వల్ల తెలంగాణ రాష్ట్రానికి మేలు జరుగుతుందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆయన న్యాయవాదిగా తెలంగాణకు సంబంధించిన పలు కేసుల్లో మిగతా.. 2లో



# ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టండి..

- ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది
- సిటీ అభివృద్ధిలో క్షత్రియులూ భాగస్వాములే
- కఠోర శ్రమతోనే క్షత్రియులు రాణించారు
- క్షత్రియ సేవాసమితి ఏర్పాటు చేసిన అభినందన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్ట్ 18 (నమస్తే ఉదయం):**

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని క్షత్రియులకు ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. వారికి సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ప్రకటించారు. క్షత్రియ భవన్‌కు కావాల్సిన స్థలం, అవసరమైన సహకారం తమ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. హైదరాబాద్ మిగతా.. 2లో

# రుణమాఫీ పేరుతో మోసం..

## రాహుల్, ఖర్గేకు కేటీఆర్ లేఖ



**హైదరాబాద్, ఆగస్ట్ 18 (నమస్తే ఉదయం):**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖరాశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ గుర్తు చేస్తూ.. అమలులో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును వివరించారు. తెలంగాణ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో మోసం చేసిందని చెప్పారు.

రాష్ట్రంలో రుణమాఫీ అందని లక్షలాది మంది రైతుల తరఫున ఈ లేఖ రాస్తున్నానని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా రోడ్లపై ఆందోళనలు మిగతా.. 2లో



## అక్కచెల్లెల్లందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు : సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్ట్ 18 (నమస్తే ఉదయం):**

రాష్ట్రంలోని మహిళలందరికీ సీఎం రేవంత్ రెడ్డి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. మహిళల సాధికారతతో పాటు మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని అన్నారు.

ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్‌తో పాటు రెండు వందల యూనిట్ల ఉచిత గృహ విద్యుత్తు పథకాలను ఇప్పటికే అమలు చేసిందని గుర్తు చేశారు. స్వయం మిగతా.. 2లో

## కోల్‌కతా హత్యాచారంపై

# సుప్రీంకోర్టు విచారణ

- సుమోటోగా తీసుకున్న కోర్టు
- రేపు సీజేఐ ధర్మాసనం ముందుకు
- నిందితుడికి మానసిక పరీక్షలు
- శాంతిభద్రతలపై ప్రతి 2గంటలకు
- రాష్ట్రాలు నివేదిక పంపాలి: కేంద్రం
- హడావుడిగా నా బిడ్డ అంత్యక్రియలు
- దీనిపై అనుమానాలు ఉన్నాయి
- న్యాయం జరిగేదాకా సాయం తీసుకోం
- ట్రైనీ డాక్టర్ తండ్రి వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 18 (నమస్తే ఉదయం):**

కోల్‌కతా హత్యాచారం ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో మిగతా.. 2లో



## ఉప ఎన్నికలు

# తప్పవా..!

- అనర్హత వేటుకై బీఆర్ఎస్ యత్నాలు
- ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో ఆందోళన
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపైనే భారం
- అధిష్ఠానం ఆలోచనపై అయోమయం
- పాతిక మంది చేరితేనే సేఫ్ జోన్‌లో..

**హైదరాబాద్, ఆగస్ట్ 18 (నమస్తే ఉదయం):**



ఎన్నో ఆశలతో అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మెడపై ఫిరాయింపు కత్తి వేలాడుతుండటంతో వారి శాసన సభ్యత్వాల వ్యవహారం గందరగోళంలో పడింది. బీఆర్ఎస్ నుంచి 25 మంది ఎమ్మెల్యేలు చేరితేనే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం వర్తించదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇతర కాంగ్రెస్ నాయకులు 25 మంది వస్తారని చెబుతూ వచ్చినా.. వారి అంచనాలకు భిన్నంగా 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికతోనే వలసలు ఆగిపోయాయి. గేట్లు తెరిచాం.. కేవలం కేసీఆర్ కుటుంబ సభ్యులు సహా సింగిల్ డిజిట్ ఎమ్మెల్యేలు మాత్రమే బీఆరెస్‌లో ఉంటారని, మిగతా వారంతా కాంగ్రెస్‌లో చేరిపోతారని సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులంతా ఊదరగొట్టారు. కానీ.. ఇప్పటికైతే 25 సంఖ్యకు మిగతా.. 2లో

## బీజేపీలోకి

# చంపయీ సోరెన్!

- పార్టీ మారనున్న ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి!
- ఆరుగురు జేఎంఎం ఎమ్మెల్యేలతో ఢిల్లీకి
- ‘ఎక్స్’ ఖాతా నుంచి పార్టీ పేరు తొలగింపు



**న్యూఢిల్లీ/రాంచీ, ఆగస్ట్ 18 (నమస్తే ఉదయం):**

త్వరలో ఎన్నికలు జరగనున్న ఝార్ఖండ్‌లో అనూహ్య పరిణామం..! ఆ రాష్ట్ర మాజీ సీఎం, ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) కీలక నాయకుడు చంపయీ సోరెన్ బీజేపీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం జల వనరుల శాఖ మంత్రిగా ఉన్న చంపయీ.. ఆదివారం తెల్లవారుజామున పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలతో కలిసి హఠాత్తుగా ఢిల్లీ వెళ్లడం మిగతా.. 2లో

# జిఎస్టీపై పునరాలోచన ఏదీ..?

- ఈ భారాలపై ఎక్కడ మొర పెట్టుకోవాలి
- ఇన్సూరెన్స్‌లపై జిఎస్టీ విధించడం ఎంతకాలం
- మధ్యతరగతి ప్రజలకు భారంగా సొంతింటి కల

**న్యూఢిల్లీ,ఆగస్ట్ 18 (నమస్తే ఉదయం):**

భారత్ లాంటి దేశాల్లో పన్నులు సరళీకృతంగా ఉండాలి. ఒకే పన్ను విధానం అంటూ జిఎస్టీని తీసుకుని వచ్చినా పన్నుల భారాలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించడం లేదు. ప్రతి పనికి జిఎస్టీని విధించడం దారుణం కాక మరోటి కాదు. హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్, బీమా మొత్తాలపై జిఎస్టీ విధించడం దారుణం కాక మరోటి కాదు. దీనిపై ఇటీవల మిగతా.. 2లో



# జిఎస్టీపై పునరాలోచన ఏదీ..?

(మొదటిపేజీ తరువాత)

పార్లమెంటులో ప్రస్తావనకు వచ్చినా ఆర్థికమంత్రి చెప్పిన సమాధానం ప్రజలను అవమానించేదిగా ఉంది. దీనిని ప్రస్తావించిన కేంద్రమంత్రి నితిని గడ్కరీని కూడా నిర్మలా సీతరామన్ అవమానించారు. ఒక్కరు ప్రస్తావించిన అంశాన్ని 200మంది పట్టుకుని సాగదీసారని తన తలబిరుసు సమాధానంతో చెప్పారు. పెట్రో ధరలపై జిఎస్టీ విధించడం లేదు. గ్యాస్ ధరలు ఇబ్బడిముబ్బడిగా పెంచేశారు. ప్రజలు కడుతున్న పన్నులతో పాలకులు రాజ్యాలు ఏలుతున్నారు. తమ సుఖాలకు ఖర్చు చేస్తున్నారు. పథకాల పేరుతో వంచన చేస్తున్నారు. నిజానికి జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి పరిమితం చేయాలి.

పన్నుల పేరుతో ఎలా బాదుతున్నారో చర్చించాలి. ఇల్లు కొనాలంటే రకరకాలు పన్నుల రూపంలో బాదేస్తున్నారు. రిజస్ట్రేషన్లకు రాష్ట్రాలు లక్షల్లో వసూలు చేస్తున్నారు. మధ్య తరగతి ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారు. ఇలా రకరకాల పన్నులపై చర్చించాలి. అవసరమైతే పార్లమెంటులో ప్రత్యేకంగా చర్చించే ధైర్యం చేయాలి. బ్యాంకుల రుణ వితరణలో లక్ష కోట్ల రూపాయల



తరుగుదల కనిపించిందని గతేడాది రిజర్వుబ్యాంకు వెల్లడించడం గమనిస్తే, గిరాకీ మందగించడం వల్లనే కొత్త పరిశ్రమలు, వ్యాపారాలను పెట్టడానికి రుణాలు తీసుకునేవారు కరవవుతున్నారని స్పష్టమవుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తరచూ మాంద్యానికి గురవుతూనే ఉంటుంది. అది సహజ పరిణామం కూడా. ఆర్థిక మాంద్యాన్ని అధిగమించడానికి అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాలు ఒక సరళ సూత్రాన్ని పాటించి విజయం సాధించాయి. భారత్ కూడా అలాంటి ఉద్దీపన విధానాన్ని చేపట్టాలి. కొన్ని రంగాలు తమ సామర్థ్యం మేరకు ఉత్పత్తి సాగించలేక పోయాయి. ప్రభుత్వం తన వ్యయాన్ని పెంచితే ఆర్థిక వ్యవస్థలోకి ధన ప్రవాహం, దానితోపాటే గిరాకీ పెరిగి, పరిశ్రమలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత ఎక్కువగా వినియోగించుకుంటాయి. దీనికి ఉద్దీపనలు ఇవ్వాలే తప్ప కొందరు కార్పోరేట్లకు రుణాలను మాఫీచేయడం, ఎగవేతదారుల రుణాలను మాఫీ చేయడం దేశ అభివృద్ధి కాదు. అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబడే భాగ్యం కలిగిందని సంతోషపడుతున్న వేళ రూపాయితో పోల్చుకుంటే మనం ఎప్పటికీ బలహీనంగానే ఉంటున్నాం.

బలహీన దేశాలైన సూడాన్ లాంటి దేశాల్లో మాత్రమే మనం బలవంతులం. 78ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకుంటున్న వేళ వెనక్కి తిరిగి చూస్తే మన ఆర్థిక ప్రగతి బలపడిందా లేక బలహీన పడిందా అన్నది రూపాయిని అడిగితే చెబుతుంది. ప్రధానంగా మనం రూపాయిని డాలర్‌తో పోలిస్తేనే మన బలం గురించి తెలుస్తుంది. డాలర్ మనకు అందనంతగా ఎదిగి పోతోంది. ఇది డాలర్ బలమో లేక మన రూపాయి బలహీనతో కానీ పాలకులు మాత్రం ఘనంగా అభివృద్ధి గురించి ఢంకా బజాయిస్తున్నారు.

అంతెందుకు నోట్ల రద్దు జరగక ముందు ఉన్న 500 రూపాయల విలువ ఇప్పుడు పది వంద నోటుకు లేదంటే నమ్మగలమా కానీ నమ్మాలి. ఆనాటి 500 నోటు ఇవాల్టి వంద నోటు ఒకటే అన్న సంగతి బజారులో అడుగుపెడితే సామాన్యుడే చెబుతాడు. ప్రతి భారతీయుడికి ఇల్లు, విద్యుత్తు, గ్యాస్, నీరు, మరుగుదొడ్డి, నైపుణ్యాభి వృద్ధి, వైద్యం, బీమా వంటి సౌకర్యాలు అందాలి. దేశాన్ని ముందుకు తీసుకెళ్తామని చెప్పడం కాదు చేసి చూపాలి. అప్పుడే దేశం పురోగమిస్తుంది. అందుకు క్షేత్రస్థాయిలో చర్చించాలి. ప్రజల నుంచి సమాచారం సేకరించాలి.ఓ

# ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టండి..

(మొదటిపేజీ తరువాత)

అన్ని రంగాల అభివృద్ధిలో క్షత్రియుల పాత్ర ఎంతో ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. రాజులు ఏ రంగంలోనైనా రాణిస్తారని, ఇందుకు వారి శ్రమ, పట్టుదలే కారణమని చెప్పారు. క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన అభినందన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. 'సినీ రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వ్యక్తి కృష్ణంరాజు. ఇప్పుడు హాలీవుడ్ తో పోటీ పడేలా రాణించిన బాహుబలి ప్రభాస్' అని అన్నారు. కఠోరమైన శ్రమ, పట్టుదల కారణంగానే వివిధ రంగాల్లో క్షత్రియులు రాణించారని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బోసురాజు అత్యంత క్రియాశీల పాత్ర పోషించారని అన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో తనకు టికెట్ రాకపోయినా పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేశారని, ఆయన కష్టాన్ని పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ గుర్తించారని, వారి నిబద్ధతకు ప్రాధాన్యతనిస్తూ వారిని మంత్రిని చేశారని తెలిపారు. నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు ఉంటుందనడానికి బోసురాజు, శ్రీనివాస వర్మ ఒక ఉదాహరణ అని రేవంత్‌రెడ్డి చెప్పారు. రాజులలో రాజకీయాల్లో రాణించాలని ఉన్నవాళ్లను మీరు ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి కోరారు. వారికి తప్పకుండా అవకాశం కల్పిస్తామని క్షత్రియ సోదరులకు మాట ఇస్తున్నానని చెప్పారు.

'మీ తరఫున తెలంగాణ ప్రభుత్వంలో సలహాదారుగా శ్రీనివాస రాజు ఉన్నారు. మీ సమస్యలను వారి ద్వారా నా దృష్టికి తీసుకురండి. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కో చైర్మన్ గా శ్రీని రాజును నియమించాం. ఇది క్షత్రియులపై మాకున్న నమ్మకానికి నిదర్శనం' అని రేవంత్‌రెడ్డి చెప్పారు. అల్లూరి సీతారామరాజు, కొమురం భీమ్ స్ఫూర్తితో తాము ప్రజా సమస్యలపై కొట్లాడామని చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధిలో క్షత్రియులు కూడా భాగస్వాములేనని, వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని చెబుతూ.. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని రాజులందరికి పిలుపునిచ్చారు.

## కోల్‌కతా హత్యాచారంపై
# సుప్రీంకోర్టు విచారణ

(మొదటిపేజీ తరువాత)

కూడిన ధర్మాసనం ఈ కేసుపై మంగళవారం విచారణ జరపనుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో వివరాలను వెల్లడించారు. 20న విచారించనున్న కేసుల జాబితాలో ఇది కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కేసుపై ఇప్పటికే సీబీఐ దర్యాప్తు కొనసాగుతున్న విషయం




తెలిసిందే. మరోవైపు, జూనియర్ డాక్టర్‌పై దారుణంగా లైంగికదాడికి పాల్పడి, హత్య చేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సంజయ్ రాయ్‌కి ఆదివారం మానసిక పరీక్షలు జరిపారు. ఢిల్లీ నుంచి కోల్‌కతాకు వచ్చిన సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి చెందిన మానసిక విశ్లేషకులు ఈ పరీక్షలు నిర్వహించారు. కోల్‌కతా పోలీస్ విభాగంలో పౌర వలంటీర్‌గా 2019లో చేరిన సంజయ్‌రాయ్ ఇప్పటికి నాలుగుసార్లు పెళ్లిళ్లు చేసుకున్నాడని, అతడొక తిరుగుబోతు అని, బాక్సింగ్‌లో ప్రవేశం ఉందని వెల్లడైంది. తాజా ఘటన అనంతరం ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ పదవి నుంచి వైదొలిగిన సందీప్ ఘోష్‌ను సీబీఐ అధికారులు ఆదివారం కూడా విచారించారు.

ఆయన ఫోన్‌కాల్స్ వివరాలను పరిశీలిస్తున్నారు. హత్యాచారం ఘటన జరిగిన ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో సీబీఐ దర్యాప్తు బృందం త్రీడీ లేజర్ మ్యాపింగ్ నిర్వహించింది. కాగా, హత్యాచారానికి బలైన జూనియర్ డాక్టర్ పేరు వెల్లడిస్తూ సోషల్ మీడియాలో వీడియో విడుదల చేసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, సినీ నటి రచనా బెనర్జీపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో ఆమె ఆ వీడియోను తొలగించి క్షమాపణ చెప్పారు. ఇదిలా ఉండగా, కోల్‌కతా ఘటనపై దేశవ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. శాంతిభద్రతల పరిస్థితులపై ప్రతీ రెండు గంటలకోసారి తమకు నివేదిక పంపించాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రహోంశాఖ ఈ నెల 16న ఆదేశాలు జారీ చేసినట్లుగా తాజాగా వెల్లడైంది. ఈ మేరకు రాష్ట్రాల పోలీసు విభాగాలు కేంద్ర హోంశాఖకు నివేదికలు పంపుతున్నాయి.

# ఉప ఎన్నికలు తప్పవా..!?

(మొదటిపేజీ తరువాత)

దగ్గరలో కూడా లేరు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్ కడియం శ్రీహరి తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటువేయాలంటూ అసెంబ్లీ స్పీకర్ తో పాటు హైకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించింది. హైకోర్టు ఈ కేసు విచారణను తేల్చేదిశగా సాగుతుండటంతో ఫిరాయింపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో అనర్హత గుబులు మొదలైంది. అటు మిగిలిన ఏడుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టులో సైతం కేసు దాఖలు చేయాలని బీఆర్ఎస్ నిర్ణయించు కుంది. ఈ నేపథ్యంలో కోర్టు తీర్పులు తమకు ప్రతికూలంగా వస్తే అనవసరంగా ఉప ఎన్నికలను ఎదుర్కోవాల్సివస్తుందన్న ఆందోళన ఫిరాయింపు ఎమ్మెల్యేలను కలవరపెడుతున్నది. దీనికి తోడు ఉప ఎన్నికలు ఖాయమంటూ కేటీఆర్, హరీశ్‌రావు చేస్తున్న ప్రకటనలు సైతం ఫిరాయింపు ఎమ్మెల్యేలను భయపెడుతున్నాయి. దీంతో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో సైతం కొందరూ అనర్హత భయంతో ఊగిస లాడుతూ త్రిశంకు స్వర్గంలో కొనసాగు తున్నారు. రెండు పార్టీల అధిష్ఠానాలతో టచ్‌లో ఉంటున్నారు. ఇందుకు ఇటీవల అసెంబ్లీ లాబీల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, తెల్లం వెంకట్రావు వైఖరినే నిదర్శనంగా కనిపించింది. తాము 25 మంది ఎమ్మెల్యేలు కచ్చితంగా కాంగ్రెస్‌లోకి వస్తారని భావించామని, పరిస్థితులు అలా కనిపించడం లేదని, అలాంటప్పుడు అనర్హత వేటును ఎదుర్కోక తప్పదన్న ఆందోళన ఫిరాయింపు ఎమ్మెల్యేలను పీడిస్తున్నది.

### వలసలు ఆగాయా ..కొనసాగుతాయా

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వలసలు ఆగినట్లేనా అంటే భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతున్న తీరుపై విశ్లేషణతోనో లేక కేసీఆర్ వలసలకు అడ్డుకట్ట వేయడంలో నిరంతరం సాగిస్తున్న ప్రయత్నాల ఫలితమో లేక కాంగ్రెస్ నుంచి సరైన హామీలు లభించకనో గానీ.. బీఆర్ఎస్ నుంచి కొత్తగా ఎవరూ కాంగ్రెస్‌లో చేరేందుకు ముందుకు రావడం లేదని విశ్లేషకులు అంటున్నారు. కాంగ్రెస్ నేతలు మాత్రం అషాఢ మాసం అడ్డురావడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నేపథ్యంలో వలసలకు విరామం పడిందని, ముగింపు కాదని చెబుతున్నారు. త్వరలోనే మరింత మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వలసలు కొనసాగుతాయని ఘంటాపథంగా చెబుతున్నారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఆపరేషన్ ఆకర్ష్ తిరిగి ప్రారంభించారని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సంప్రదింపులతో పాటు చేరికలకు మొగ్గు చూపని వారిని ఆర్థికంగా ఇబ్బంది పెట్టే కార్యక్రమాలను సాగిస్తున్నారన్న ప్రచారం వినిపిస్తున్నది. రాజధాని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్ రెడ్డి వేధింపు పంథా అనుసరిస్తున్నారని చెబుతున్నారు. వేధింపులకు బదులుగా తమ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకుల నుంచి అడ్డంకులు తొలగిస్తే తాము కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమని ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి సిగ్నల్స్ వెళ్లినట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి.

అదే నిజమైతే బీఆర్ఎస్ ఎల్పీ చీలికకు కావాల్సిన 25మంది ఎమ్మెల్యేల మార్కు ఫిరాయింపులు సాగాల్సి వుంది. పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయన్న వాదన సైతం వినిపిస్తున్నది. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో స్థానిక కాంగ్రెస్ నేతల నుంచి రాజకీయంగా సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ తరహా సమస్యలతో పాటు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల అనర్హత కేసు నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరి కొత్త తలనొప్పులు ఎందుకు తెచ్చుకోవడమన్న ఆలోచనతో ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారన్న ప్రచారం సాగుతున్నది. మరీముఖ్యంగా కాంగ్రెస్ అధిష్ఠానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారంపై సానుకూలంగా లేదని, వలసల ప్రక్రియ కొనసాగించకుండా సీఎం రేవంత్‌రెడ్డికి బ్రేక్ వేసిందన్న ప్రచారం సైతం ఉన్నది.

### తేలనున్న వలసల లెక్కలు

ఇప్పటికే బీఆరెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేల నుంచి రేవంత్‌రెడ్డిపై ఒత్తిడి పెరిగింది. వారిని అనర్హత వేటు ముప్పు నుంచి తప్పించేందుకు మరో 15మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకునే ప్రక్రియను సాగించాల్సిన అనివార్యత రేవంత్ రెడ్డిపై పడింది. లేదంటే దానం, కడియం, తెల్లంపై అనర్హత వేటు పడితే ఆ స్థానాల్లో ఉప ఎన్నికలను ఎదుర్కోక తప్పదు. అసలే కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమల్లో జాప్యం నేపథ్యంలో ఉప ఎన్నికలను ఎదుర్కోవడం అంత సులభం కాదంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

# కాంగ్రెస్‌లో భారీ మార్పులు!

## మీడియా ఇన్‌చార్జిగా జైరాం రమేశ్ అవుట్!

## కేరళ పీసీసీ చీఫ్‌గా వెళ్లనున్న వేణుగోపాల్?

**న్యూఢిల్లీ, ఆగస్టు 18, (నమస్తే ఉదయం):** కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా భారీ మార్పులు తలపెట్టినట్లు తెలిసింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శుల్లో కీలకంగా వ్యవహరిస్తున్న జైరాం రమేశ్ (మీడియా వ్యవహారాల ఇన్‌చార్జి), కేసీ వేణుగోపాల్ (సంస్థాగత వ్యవహారాలు)లను మార్చబోతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ముఖ్యంగా జైరాం రమేశ్‌పై రాహుల్‌గాంధీకి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. బీజేపీ విమర్శలను అనుకున్న రీతిలో ఆయన తిప్పికొట్టలేకపోతున్నారని, హరియాణా, మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇది ప్రతికూల ప్రభావం చూపించవచ్చని సీనియర్ నాయకులు చెప్పారు.

దీంతో ఆ పదవి నుంచి వైదొలగాలని జైరాంను రాహుల్ కోరుతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అయితే తనను ఈశాన్య భారత వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమించాలని జైరాం విజ్ఞప్తి చేశారని పేర్కొన్నాయి. రాహుల్‌కు అత్యంత సన్నిహితుడైన వేణుగోపాల్‌ను మార్చాలనుకోవడమే పార్టీ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్థాన్‌లో కాంగ్రెస్ విజయం సాధించడంతో.. నాడు ఏఐసీసీ సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా ఉన్న అశోక్ గహ్లోత్ సీఎంగా వెళ్లారు. దరిమిలా ఆ పదవి చేపట్టిన వేణుగోపాల్.. ఇప్పటికీ కొనసాగుతున్నారు. కేరళ పీసీసీ అధ్యక్షుడిగా వెళ్లాలని రాహుల్‌గాంధీయే ఆయన్ను కోరారని అంటున్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో కేరళలో కాంగ్రెస్ కూటమి యూడీఎఫ్ ఘనవిజయం సాధించింది. 20 స్థానాల్లో 18 గెలిచింది. 2026లో ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్నాయి. సీఎం పదవికి రేసులో తాను లేనని వేణుగోపాల్ చెబుతున్నప్పటికీ.. ఆయనకు ఆ ఆకాంక్ష ఉందని ఓ సీనియర్ నేత తెలిపారు.

పీసీసీ పగ్గాలు చేపడితేనే టికెట్ల పంపిణీ తన చేతుల్లో ఉంటుందని.. యూడీఎఫ్ విజయం సాధిస్తే తన వర్గం ఎమ్మెల్యేలు ఎక్కువగా ఉంటే తనకే సీఎం పీఠం దక్కుతుందని ఆయన భావిస్తున్నారని.. అందుకే రాష్ట్ర రాజకీయాలకు వెళ్లాలనుకుంటు



న్నారని పేర్కొన్నారు. కాగా.. వేణుగోపాల్ స్థానంలో సంస్థాగత ప్రధాన కార్యదర్శి పదవి రేసులో రాజస్థాన్, ఛత్తీసగఢ్ మాజీ సీఎంలు అశోక్ గహ్లోత్, భూపేశ్ బఘేల్ ఉన్నట్లు తెలుస్తోంది. సోనియాకు అత్యంత విశ్వాసపాత్రుడిగా మెలిగిన గహ్లోత్.. ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికల సమయంలో అధిష్ఠానాన్ని ధిక్కరించారు.

తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరాజయానికి కారణమయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనకు మళ్లీ ఇంతటి కీలక పదవిని రాహుల్ అప్పగిస్తారా అనేది అనుమానమేనని పార్టీ వర్గాలు అంటున్నాయి. బఘేల్ ప్రియాంకకు సన్నిహితుడు. ఆయన్ను సంస్థాగత ఇన్‌చార్జిగా నియమిస్తే పార్టీలో ప్రియాంక పాత్ర పెరుగుతుందని.. రాహుల్ సన్నిహితులు తగ్గిపోతారని కొందరి వాదన. అయితే, మార్పులపై రాహుల్‌దే తుది నిర్ణయమని ఏఐసీసీ వర్గాలు స్పష్టంచేశాయి.

## అభిషేక్ మను సింఘ్వీ రాజ్యసభ అభ్యర్థిత్వానికి
# ఓకే చెప్పిన సీఎల్పీ..

(మొదటిపేజీ తరువాత)

సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారని గుర్తు చేశారు. భారతదేశంలో నంబర్ వన్ న్యాయవాదుల్లో ఆయన కూడా ఒకరని మంత్రి చెప్పారు. అలాంటి వ్యక్తి రాష్ట్రం నుంచి పోటీ చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఆయన తండ్రి ఎలెన్ సింఘ్వీ బ్రిటన్ దేశానికి భారత రాయబారిగా వ్యవహరించారని, లోక్ సభ ఎంపీగా ఉంటూనే సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పని చేశారని మంత్రి తెలిపారు. తండ్రి అడుగు జాడల్లోనే అభిషేక్ సింఘ్వీ నడుస్తూ కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు.

# అక్కచెల్లెల్లందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు : సీఎం రేవంత్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాత)

సహాయక సంఘాల మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తగినంత చేయూతను అందిస్తుందని తెలిపారు.

మహిళల రక్షణ, భద్రత విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని, ఎక్కడ మహిళల అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని అన్నారు. అక్కా చెల్లెళ్లందరికీ తమ ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, అందరి దీవెనలతో విజయవంతంగా ప్రజాపాలన సాగిస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

# రుణమాఫీ పేరుతో మోసం..

(మొదటిపేజీ తరువాత)

చేస్తున్నారని.. రైతులందరికీ రుణమాఫీ చేయకుంటే వారి తరఫున కాంగ్రెస్ పార్టీపై పోరాడతామని ఆ లేఖ ద్వారా హెచ్చరించారు.

వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట రైతులకు రెండు లక్షల రుణమాఫీ హామీ ఇచ్చారని, కానీ ఈ ప్రభుత్వం అనేక షరతులు పెట్టి 40 శాతం మందికి మాత్రమే రుణమాఫీ చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. 40 వేల కోట్ల రూపాయల రుణమాఫీ అని చెప్పి కేవలం 17 వేల కోట్ల రుణమాఫీతో రైతులను నట్టేట ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా రైతులు ఇప్పటికే రోడ్లపై ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి మాయ మాటలు చెప్పి రైతులను మోసం చేస్తున్నారని కేటీఆర్ చెప్పారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు లక్షరూపాయల రుణమాఫీ చేస్తేనే 17 వేల కోట్లు ఖర్చయిందని..ఏకంగా 36 లక్షల మంది రైతులు రుణవిముక్తులై లబ్ది చేకూరిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నట్టు రెండు లక్షల రుణమాఫీ పూర్తయితే.. లబ్దిదారుల సంఖ్యతోపాటు రుణమాఫీ మొత్తం పెర గాలి, దాదాపు రెట్టింపు కావాలి. కానీ కేవలం 17,900 కోట్లతో రెండు లక్షల రుణమాఫీని పూర్తిచేశామనడం ముఖ్యమంత్రి డొల్లవాదనకు నిదర్శనమన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేయకపోతే తాము వారి తరఫున పోరాడుతామని స్పష్టం చేశారు.

## టిజిఎస్ పిడిసిఎల్‌లో
# ప్రమోషన్ల జాతర

(మొదటిపేజీ తరువాత)


ఏడీఈలుగా ప్రమోషన్ ఇచ్చారు. మరో 1650 జూనియర్ లైన్ మన్లకు అసిస్టెంట్ లైన్ మన్లుగా పదోన్నతి కల్పించారు.

ఈమధ్యే ఈ పదోన్నతుల విషయమై ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖా మంత్రి కూడా అయిన మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తేగా, ఆయన సత్వరమే స్పందించి, సాధ్యమైనంత త్వరగా ప్రమోషన్ల విషయాన్ని పరిష్కరిచాల్సిందిగా సిఎండీని ఆదేశించారు. దాని ఫలితమే నేటి ఈ ఉత్తర్వులు. ఈ ప్రమోషన్లు 2017వ సంవత్సరం నుండి పెండింగ్ లో ఉండగా, చాలామంది అర్హులైన ఉద్యోగులు పదోన్నతి పొందకుండానే పదవీ విరమణ చేసారు. సిఎండీ ఫారుఖీ మాట్లాడుతూ, ఈ పదోన్నతుల వల్ల ఖాళీ అయిన స్థానాలను భర్తీ ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తామని స్పష్టం చేసారు.

# బీజేపీలోకి చంపయీ సోరెన్!

(మొదటిపేజీ తరువాత)

ఊహాగానాలకు కారణమైంది. కుమార్తెను కలిసేందుకే దేశ రాజధానికి వచ్చినట్లు ఆయన చెప్పారు. అయితే, ఈలోగానే తన 'ఎక్స్' ఖాతా నుంచి పార్టీ పేరును తొలగించారు. సాయంత్రానికి సుదీర్ఘ లేఖ విడుదల చేశారు. జేఎంఎంలో తీవ్ర అవమానాలు ఎదుర్కొన్నానని, వాటిని తట్టుకోలేకే ప్రత్యామ్నాయం గురించి ఆలోచిస్తున్నానని పేర్కొన్నారు. రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకోవడం, సొంతంగా పార్టీని స్థాపించడం, తోడుగా నిలిచేవారితో కలిసి ప్రయాణించడం అనే మార్గాలు తన ముందు ఉన్నాయని వివరించారు. కాగా, జేఎంఎం అధిష్ఠానానికి నమ్మకస్తుడయిన చంపయీ ఫిబ్రవరి 2 నుంచి జూలై 3 వరకు సీఎంగా వ్యవహరించారు. భూ కుంభకోణం కేసులో హేమంత్ సోరెన్‌ను ఈడీ అరెస్టు చేయడంతో సీఎంగా చంపయీకి అవకాశం దక్కింది. హేమంత్‌కు బెయిల్ రావడంతో వైదొలగాల్సి వచ్చింది. అప్పటినుంచి ఆయన అసంతృప్తిగా ఉన్నట్లు చెబుతున్నారు. శనివారం రాత్రి కోల్‌కతాలో బెంగాల్ బీజేపీ నాయకుడు సువేందుతో చంపయీ సమావేశమయ్యారని, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సంప్రదింపుల్లో ఉన్నారని సమాచారం.



# అమెరికాలో మళ్లీ కరోనా కలవరం!

**వాషింగ్టన్,(నమస్తే ఉదయం):** కొవిడ్ కొత్త వేరియెంట్ 'కేపీ.2' అమెరికాను వణికిస్తున్నది. దవాఖానల్లో చేరుతున్నవారి సంఖ్య పెరుగుతున్నది. ప్రతి 10 లక్షల మందికి ఒకటి నుంచి నాలుగుకు పెరిగింది. 2022 జూలై తర్వాత, మురుగునీటిలో వైరల్ యాక్టివిటీ (ఆగస్టు 10న 8.82) అత్యధిక స్థాయికి చేరుకుంది. వేసవి సీజన్‌లో కరోనా వ్యాప్తి ఎక్కువగా ఉందని సీడీసీ గణాంకాలు చెబుతున్నాయి. 'శాంపిల్స్‌లో 100% 'సార్స్-కోవ్-2'ను గుర్తించాం' అని వేస్ట్‌వాటర్ స్కాన్' ప్రోగామ్ డైరెక్టర్ మార్లినె అన్నారు. స్కూళ్ల సెలవులు ముగిసాక, కేసుల సంఖ్య పెరిగే అవకాశముందని వైద్య వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎఫ్‌డీఏ అనుమతులు వస్తే, కేపీ.2 వేరియెంట్‌కు కొత్త వ్యాక్సిన్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో అందుబాటులో వస్తుందని తెలిసింది.





## అక్రమ నిర్మాణదారుల గుండెల్లో

# దడ పుట్టిస్తున్న హైడ్రా

**ఎక్కడికక్కడ అక్రమ నిర్మాణాలు నేల మట్టం**

**గండిపేట, మొయినాబాద్ మండలాలలో అక్రమ నిర్మాణాలపై కొరడా**

**భారీగా పోలీసుల మోహరింపు**

**కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**గండిపేట్/మొయినాబాద్, ఆగస్టు18 (నమస్తే ఉదయం):** గత ప్రభుత్వ హయాంలో రాజేంద్రనగర్, చేవెళ్ల నియోజకవర్గాలలో ఉన్న చెరువులు నాళాలు కుంటలు ఫిరంగి నాళాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలకు తేరలేపిన కబ్జా దారులకు కొత్తగా ఏర్పడిన రేవంత్ సర్కార్,రాష్ట్ర వ్యాప్తంగా ఆక్రమణకు గురైన చెరువులపై చర్యలు తీసుకునేందుకు హైడ్రా కమిషన్ ఏర్పాటు చేసిన సంగతి విధితమే.

హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశానుసారం గండిపేట్ మండలం ఖానాపూర్ ప్రాంతంలో ఉస్మాన్ సాగర్ చెరువు బఫర్ జోన్ ప్రాంతంలో ఇరువైపులా వెలిసిన భారీ అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కు పాదం మోపారు. ఎక్కడికక్కడ అక్రమ నిర్మాణాలను నెలమట్టం చేశారు. మొన్న రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి శివరాంపల్లి ఎన్.పి.ఎ, ఎదురుగా ఉన్న భమ్ రూక్ దౌల నాథ్ చెరువు అన్యాక్రాంతం పై హైడ్రా కోరడా ఝులిపించింది. తాజాగా గండిపేట్ జలాశయం బఫర్ ప్రాంతంలో వెలిసిన అక్రమ నిర్మాణాలను భారీ మిషనరీలతో నేలమట్టం చేశారు. ఈ కూల్చివేతల ప్రక్రియ ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు కొనసాగింది. కూల్చివేతల్లో ఎలాంటి గొడవలు తేలేత్తకుండా నార్సింగి ఎసిపి రమణ గౌడ్,నేత్రత్వంలో ఇన్స్పెక్టర్ హరికృష్ణ రెడ్డి పర్యవేక్షణలో భారీగా పోలీసులను మొహరించారు. అక్రమ నిర్మాణదారుల గుండెల్లో దడ పుట్టిస్తున్న హైడ్రా.

ఎక్కడికక్కడ అక్రమ నిర్మాణాలు నేల మట్టం చేస్తున్న వైనం. కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన పలువురిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులు. నార్సింగి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, శ్రీధర్ గౌడ్,మణిహారిక, శానిటేషన్ విభాగం ఇన్స్పెక్టర్ లచ్చిరాం, జలమండలి,విద్యుత్ శాఖ,ఇరిగేషన్, అధికారులు,డిజాస్టర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**రెస్టారెంట్ నిర్మాణంలో భారీగా ముడుపులు??**

బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టెందుకు కోట్ల రూపాయలు చేతులు మారినట్టు తెలుస్తుంది. బఫర్ జోన్ ప్రాంతంలో అన్ని శాఖల అధి కారులను మచ్చిక చేసుకుని ముడుపులు అందించి అక్రమ నిరణాలను చేపట్టినట్టు బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖానాపూర్ ప్రధాన రహదారిపై బఫర్ ప్రాంతంలో నిర్మిస్తున్న ఓ రెస్టారెంట్ నిర్మాణానికి సంబంధించి ఏకంగా 40 లక్షలను అధికారులు, పాలక వర్గం పంచుకో మని ముట్టజెప్పినట్టు బహిరంగ ఆరోపణలు వస్తున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో ముడుపులు అందజేసిన తమ నిర్మాణం నేలమట్టం చేయ డంతో చేసేదేమి లేక ఎవరిని అడగలేక తలలు పట్టుకుంటున్న సదరు వ్యక్తులు.

**అక్రమ నిర్మాణాలపైన హైడ్రా అధికారుల ఉక్కు పాదం**

**మొయినాబాద్ మండలంలో...**

మండల పరిధిలోని చిలుకూరు గ్రామ పరిధిలో అక్రమ నిర్మాణాల పైన ఆదివారం హైడ్రా అధికారులు కొరడా ఝులిపించారు. మొయినాబాద్ మండలంలోని చిలుకూరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న వెస్ట్ సైడ్ వెంచర్ లో గండిపేట చెరువు ఎఫ్ టి ఎల్‌లో అక్రమంగా నిర్మించిన భారీ నిర్మాణాలను హైడ్రాధికారులు కూల్చివేశారు. హైడ్రా అధికారులు ఏఈ మల్లికార్జున్ వాటర్ వర్క్స్ విజిలెన్స్ హెచ్ఎండిఏ అధికారులు లక్ష్మీరెడ్డి మరియు మొయినాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసుల భారీ బందోబస్తు మధ్యన నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వ భూములు, చెరువులు అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను అధికారులు నేలమట్టం చేశారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న విషయం తెలిసిన స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోవడంతో పోలీసులు వారిని అడ్డగించారు. కొంతసేపు వాగ్వాదం జరిగింది. కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అనుమతులు లేకుండా అక్రమంగా ప్రభుత్వ స్థలంలో ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



అన్నదాన కార్యక్రమంలో భక్తులు

## ధర్మ సాయి సన్నిధిలో శ్రావణమాస అన్నదానం

**శంషాబాద్, ఆగస్టు 13(నమస్తే ఉదయం):** శంషాబాద్ పట్టణంలోని శ్రీ ధర్మసాయి మందిరంలో ఆదివారం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పవిత్రమైన శ్రావణమాసంలో సాయిబాబా దర్శనం పొందడం గొప్ప అదృష్టం అని దేవాలయ ట్రస్ట్ బోర్డు వ్యవస్థాపక చైర్మన్ ధరణి మాత. ట్రస్టు బోర్డు సభ్యుడు శివ సాయి దత్తు తెలిపారు. శ్రావణమాసంలొ సాయిబాబా ఆశీస్సులు పొందడానికి భక్తులు ముందుకు వచ్చి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రతి ఆదివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ధరణి మాత. శివ సాయి దత్తు కోరారు.

## సర్దార్ పాపన్న గౌడ్ జీవితం అందరికీ ఆదర్శం : సురేష్ గౌడ్

**శంషాబాద్,ఆగస్టు 18(నమస్తే ఉదయం):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ప్రజలందరికీ ఆదర్శమని ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని శంషాబాద్ మండలం పెద్ద తూప్రా గ్రామ మాజీ పంచాయతీ సభ్యుడు మండల గౌడ సంఘం



నాయకుడు బి సురేష్ గౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374 వ జయంతి సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో పెద్ద తూప్రా గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా సురేష్ గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా షాపూర్ లో జన్మించిన సర్దార్ పాపన్న గౌడ్ ఆనాటి పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు అరాచకాలపై తిరుగుబాటు చేశారని తెలిపారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై తిరుగుబాటు చేసి వారికి న్యాయం జరిగేలా విస్తృతమైన పోరాటాన్ని చేశారని అన్నారు. అనంతరం కేకును కట్ చేసి సభ్యులందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బి రవి గౌడ్. కే నరసింహ గౌడ్. డి వెంకటేష్ గౌడ్. జంగయ్య గౌడ్. లక్ష్మణ్ గౌడ్. అభి గౌడ్. ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నడిగడ్డలో అరాచక పాలనకు స్వస్తి పలుకుద్దాం..

**- గద్వాల జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ సరిత**



సర్వాయి సర్దార్ పాపన్నకు నివాళు లర్పిస్తున్న మాజీ జడ్పీ చైర్మన్ సరిత

**గద్వాల,ఆగస్టు18(నమస్తే ఉదయం):** బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని నడిగడ్డలో అరాచక పాలనకు స్వస్త పలుకాలని జెడ్పీ మాజీ చైర్ పర్సన్ సరిత పిలుపునిచ్చారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని మాజీ జెడ్పీ చైర్ పర్సన్ నివాసంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ శతాబ్దాల కిందటే రాచరిక నిరంకుశత్వానికి వ్యతి రేకంగా పేదప్రజలను సంఘటితం చేసి, రాజకీయ-సామాజిక సమానత్వమే మూల సూత్రంగా గోల్కొండను ఏలిన బహుజన చక్రవర్తిగా సర్వాయి పాపన్న చరిత్ర అసామాన్య మైనదని కొనియాడారు. సర్వాయి పాపన్న పోరాటస్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం వారి ఆశయాలను కొనసాగిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మధుసూదన్ బాబు, కౌన్సిలర్లు నరహరి గౌడ్, శ్రీనివాస్ గౌడ్, అల్వాల రాజశేఖర్ రెడ్డి, ఆనంద్ గౌడ్, అమరావాయి కృష్ణారెడ్డి, టి.శ్రీనివాసులు, జనార్థన్ గౌడ్, నర్సన్ గౌడ్,డిటిడిసి నర్సింహులు, నాగేంద్ర యాదవ్,శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్,కృష్ణయ్య గౌడ్, కొండపల్లి రాఘవేంద్ర రెడ్డి,రామచంద్ర గౌడ్,వెంకటస్వామి గౌడ్,శెట్టి ఆత్మకూరు కృష్ణయ్యగౌడ్, తుంకుంట కృష్ణయ్య గౌడ్, రాఘరామి రెడ్డి,జగదీష్,డి.ఆర్.శ్రీధర్,దడవాయి నర్సింహులు, కుమ్మరి నారాయణ, సుదీర్,రంగస్వామి గౌడ్ తదితరులు ఉన్నారు.

## బరితెగిస్తున్న దొంగలు...

**ఆందోళన చెందుతున్న అన్నదాతలు**



**గద్వాల ,ఆగస్టు18(నమస్తే ఉదయం):** దొంగలు బరి తెగిస్తున్నారు. రైతులు తమ పొలాలకు నీళ్లు పారించుకునేందుకు ఏర్పాటు చేసిన పంపు మోటార్ల కేబుల్ వైర్లను ఎత్తుకెళ్తున్నారు. వ్యవసాయ పంపు మోటార్లకున్న కేబుల్ వైర్లను కట్ చేసి, వాటిని తీసుకుని పరారవుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ధరూర్ మండలంలోని ఆయా గ్రామాల రైతులు తమ వ్యవసాయ పొలాలకు నీరు పారించుకునేందుకు నెట్టెంపాడు ఎత్తిపోతల భాగంగా నిర్మించిన కాలువకు పంపు మోటార్లు వేసుకొన్నారు.

గత కొన్ని రోజులుగా రాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు పంపు మోటార్ ల కేబుల్ వైర్లను ఎత్తుకెళ్తున్నారు. సుమారు 40 మంది రైతులకు చెందిన కేబుల్ వైర్లు చోరీకి గురైనట్లు బాధితులు తమ అవేదను వ్యక్తం చేస్తున్నారు. ఇలా సీజన్ వచ్చిందంటే చాలు దొంగలు కరెంటు కేబుల్ వైర్లను కట్ చేసి ఎత్తుకెల్తుడటంతో రైతులను నిద్రలేకుండా చేస్తున్నారని పలువురు వాపోయారు. అప్పులు చేసి కొత్త కేబుల్ వైర్లను కొనుగోలు వేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్క కేబుల్ వైర్ విలువ సుమారు. 3వేలకు పైగా ఉండటంతో కేబుల్ వైర్లను కట్ చేసి, వైర్లను కాల్చి అందులో ఉన్న విలువైన కాఫర్ వైర్ ను సేకరించి బయట మార్కెట్ లో విక్రయించేందుకు ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరంలో నాలుగైదు సార్లు ఇలా దొంగలు కేబుల్ వైర్లను దొంగిలించుకపోవడం షరా మామూలైందన్నారు. గతంలో కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లినప్పుడు ధరూర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు, పోలీసులు దొంగలపై నిఘా ఉంచి... కేబుల్ వైర్లను ఎత్తుకెళ్తున్న దొంగలను గుర్తించి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## రుణమాఫీ జరిగిన రైతుల కన్నా జరుగని వారే అధికంగా ఉన్నారు

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి డైరెక్టర్ బూర్కుంట సతీష్**



**శంషాబాద్, ఆగస్టు 18( నమస్తే ఉదయం):** రుణమాఫీ పథకంలో మాఫీ జరిగిన రైతుల కన్నా మాఫీ జరగని రైతులే అధికంగా ఉన్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకం సంపూర్ణంగా అమలు జరగ లేదని అర్హులైన అనేకమంది రైతులకు న్యాయం జరగలేదని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి డైరెక్టర్ శంషాబాద్ మండలం మల్కారం సింగిల్ విండో చైర్మన్ బూర్కుంట సతీష్ అన్నారు. ఏక మొత్తంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించి అమలుకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ రైతులందరికీ రుణమాఫీ జరగలేదని అన్నారు. 2 లక్షల రూపాయల వరకు ఉన్న రుణాలను ఏక మొత్తంలో మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినప్పటికీ ఇది పూర్తి స్థాయిలో అమలు జరగలేదని వివరించారు. తమ సహకార సంఘంలో 386 మంది లక్ష న్నర రూపాయల అప్పు తీసుకున్న రైతులు ఉండగా దాదాపు 200 మందికి ఇంకా మాఫీ జరగలేదని అన్నారు.

వివిధ సాంకేతిక కారణాలను చూపిస్తూ అధికారులు రుణమాఫీ చేయడం లేదని ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సతీష్ డిమాండ్ చేశారు.




బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

## బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసాత్మక సంఘటనలను నిరసిస్తూ ర్యాలీ

**రాజేంద్రనగర్, ఆగస్టు18(నమస్తే ఉదయం):** బంగ్లాదేశ్ లో హిందువుల దేవాలయాల పైన, హిందువుల పైన జరుగుతున్న దాడులను ఆపాలని కోరుతూ ఆదివారం ర్యాలీ నిర్వహించారు. హిందు మహిళల పైన జరుగు తున్న ఘోరమైన అత్యాచారాలను ఆపాలని నిరసన తెలియజేసారు. ఇప్పటివరకు చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని అత్తాపూర్ డివిజన్ రాంబాగ్ రోడ్ బ్రహ్మాచారి మఠ్ నుంచి తేజస్వి నగర్ కాలనీ అత్తాపూర్ మీదుగా పిల్లర్ నవంబర్




ర్యాలీలో పాల్గొన్న మహిళలు

122 నుంచి 143 వరకు, అక్కడి నుంచి రాంబాగ్ గ్రౌండ్ వరకు శాంతియుతంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి , సంతోష్ కుమార్ అగర్వాల్, సురేష్ కుమార్ మోది, పవన్ భారతి, లక్ష్మీకాంత్ వ్యాస్, అశోక్ శర్మ, దత్త, అంకుర్ బన్సల్, అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాద విజయ్ కుమార్, తేజస్వినగర్, శివాజీ నగర్, అత్తాపూర్, పాండురంగానగర్ వాసులు యువకులు ప్రజలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

**మల్కాజిగిరి, ఆగస్టు 18(నమస్తే ఉదయం):** మల్కాజిగిరి ఆనంద చౌరస్తాలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు



పురస్కరించుకొని మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వారితోపాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి ఎన్ వి సతీష్ కుమార్, గణేష్ ముదిరాజ్ ,సంతోష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ఉద్యోగుల పదోన్నతులకు సంఘీభావం తెలిపిన జలమండలి ఓసి, బిసి జేఏసీ నాయకులు



**హైదరాబాద్, ఆగస్టు18(నమస్తే ఉదయం):** విద్యుత్ శాఖలో పదోన్నతులు కల్పించాలని అధికారులు, సిబ్బంది చేస్తున్న డిమాండ్‌కు జలమండలి బిసి అండ్ ఓసి జెఏసి నాయకులు, సెక్రటరీ సాయి కిరణ్ గౌడ్ మద్దతు తెలిపారు. ఉద్యోగుల పదోన్నతుల న్యాయమైన హక్కు అని ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పదోన్నతులను వెంటనే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## మంకీపాక్స్‌పై ప్రధాని మోడీ సమీక్ష

**న్యూఢిల్లీ, ఆగస్టు18(నమస్తే ఉదయం):** మంకీపాక్స్ వైరస్‌పై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం సమీక్ష జరిపారు. ఈ వైరస్‌పై గ్లోబల్ ఎమర్జెన్సీ నేపథ్యంలో దేశంలో తీసుకోవల్సిన చర్యల గురించి ఉన్నతాధికారులతో, నిపుణులతో ఆయన చర్చించారు. ఆఫ్రికాలోని పలు దేశాలలో ఈ వైరస్ ఇప్పుడు ఎంపాక్స్‌గా నెలకొంది. పొరుగున ఉన్న పాకిస్థాన్‌లో కూడా కొన్ని కేసులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో తీసుకోవల్సిన జాగ్రత్త చర్యల గురించి ఉన్నతాధి కారులతో సమీక్షించారు. ఆదివారం ప్రధాని మోడీ కీలక ఆదేశాల మేరకు పిఎం ముఖ్యకార్యదర్శి పికె మిశ్రా అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా వైరస్ జాడలపై సరైన పర్యవేక్షణ పెట్టాలి. ఆసుపత్రులలో స్క్రీనింగ్ పద్ధతులను బలోపేతం చేయాల్సి ఉందని నిర్ణయించారు. విమాన ప్రయాణికుల రాకపోకల నేపథ్యంలో ఎయిర్‌పోర్టుల్లో , ఇదే క్రమంలో రైల్వేస్టేషన్లలో పర్యవేక్షక ఏర్పాట్లపై సమీక్షించారు. ఇప్పటికైతే దేశంలో మంకీపాక్స్ కేసులు ఏమీ లేవు. దేశంలో ఈ వైరస్ విస్తరించే అవకాశాలు తక్కువే అని నిర్ధారించారు.

అయితే తగు విధంగా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం మంచిదని నిర్ణయించారు. ప్రదాని మోడీ ఎప్పటికప్పుడు పరిస్థితిని తగు విధంగా పర్యవేక్షిస్తున్నారని పికె మిశ్రా తెలిపారు. ఈ వైరస్ లక్షణాలు, వ్యాప్తి క్రమం వంటి వాటిపై రాష్ట్రాల వారిగా వ్యాధుల నియంత్రణ విభాగం నుంచి తగు సూచనలు వెలువరించారు. దీనికి సంబంధించి మెడికల్ హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో రాష్ట్రాల నుంచి మొత్తం మీద 200 మంది వరకూ ప్రతినిధులుగా పాల్గొన్నారని వెల్లడైంది. 2022లో మంకీపాక్స్ తలెత్తిన నాటి నుంచి ప్రపంచవ్యాప్తంగా చూస్తే 99,176 మంకీ పాక్స్ కేసులు నమోదు అయినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఈ వైరస్‌తో మృతుల సంఖ్య 200 మందికి పైగా చనిపోయారు. ఆఫ్రికా దేశాలలోనే ఎక్కువ మరణాలు ఉన్నాయి. అంతర్జాతీయ విమానాశ్రయాలలో రాకపోకల దశలో సరైన టెస్టులు నిర్వహించడం

## వడ్డెరల స్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

### ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన సంఘం ప్రతినిధులు

**మల్కాజిగిరి, ఆగస్టు18(నమస్తే ఉదయం):** మల్కాజిగిరి నియోజకవర్గంలోని మౌలాలి డివిజన్ పరిధిలోని వడ్డెరల స్మశాన వాటికలో మౌలిక సదుపాయాల కల్పించాలని శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డికి సంఘం ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు.

ఆదివారం మల్కాజిగిరి అసెంబ్లీ నియోజక వర్గం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ని కలిసిన వడ్డెర కులస్తులు, నాయకులు స్మశాన వాటికలో కనీస వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. అందుకు ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా వడ్డెర స్మశాన వాటికలో కావలసిన సముదా యాల కొరకు ప్రతిపాదనలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... వెనకబడిన వడ్డెర కులం ఆర్థికంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని, ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో వడ్డెర కులస్తులు ఎదుర్కొంటున్న



మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వడ్డెర సంఘం ప్రతినిధులు

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడు గండికోట కుమార్, మౌలాలి అధ్యక్షుడు నర్సింగ్ రావు, కోశాధికారి రమేష్, సలహాదారుడు చంద్రయ్య తదితరులున్నారు.

## రైతులకు సంపూర్ణంగా రుణమాఫీ అందజేయాలి

**గద్వాల, ఆగస్టు18(నమస్తే ఉదయం):** అర్హులైన రైతులకు సంపూర్ణంగా రుణమాఫీ అందజేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం గద్వాల పట్టణంలోని డికె.బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.... రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రైతులపై వివక్ష చూపుతుందన్నారు. రైతే రాజు అన్న విషయాన్ని మరచి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో ఉన్న అందరూ రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి రూ.40 వేల కోట్ల రూపాయలతో

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీపై తొలి సంతకం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు రుణమాఫీ విషయంలో ఆహార భద్రత కార్డు ను అనుసంధానం చేసి రైతులను మోసం చేస్తుందన్నారు. కేవలం 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అందజేసిందన్నారు. రైతుల అందరికీ రుణమాఫీ చేశామని అబద్ధాలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ చేసిందని అబద్ధపు మాటలు చెప్పడంలో ఎంత మాత్రం నిజం ఉందని మీరు చెప్పిన అబద్ధపు మాటలను రాష్ట్ర రైతాంగం గమనిస్తుందని అన్నారు. రాబోయే రెండు రోజుల్లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో



ప్రతి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రతి రైతు దగ్గరకు వెళ్లి రైతు రుణమాఫీ గురించి తెలుసుకొని జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అపద్ధపు హామీలను ఎండగడతామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు , జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మల్లెందొడ్డి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా ఓబిసి మోర్చా అధ్యక్షుడు దేవదాస్ , తదితరులు ఉన్నారు.

## రాజేంద్రనగర్ సర్కిల్ ఇంచార్జి టౌన్ ప్లానింగ్ ఏసీపీగా సి.శ్రీధర్

### టౌన్ ప్లానింగ్ విభాగంలో పూర్తి స్థాయిలో అధికారులను నియమించాలంటున్న ప్రజలు

**రాజేంద్రనగర్, ఆగస్టు18(నమస్తే ఉదయం):** జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ - 11 టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీగా సి.శ్రీధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. వికారాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న సీ శ్రీధర్ రాజేంద్రనగర్ టౌన్ ప్లానింగ్ ఏసీపీగా బదిలీ అయి డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ రిపోర్ట్ చేశారు.

**టౌన్ ప్లానింగ్ విభాగంలో పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలి : ప్రజలు**

జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో పూర్తి స్థాయిలో అధికారులను నియమించాలని ప్రజలు, వివిధ కాలనీల సభ్యులు కోరుతున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ లో రాజేంద్రనగర్ తో పాటు అత్తాపూర్ , మైలార్దేవ్‌పల్లి , సులేమాన్ నగర్, శాస్త్రి పురం డివిజన్లు ఉన్నాయి. ఈ ఐదు డివిజన్లకు ఐదుగురు సెక్షన్ ఆఫీసర్లను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మానస హిల్స్ ప్రాంతంలో ఊర్జిత హెూమ్స్ లాంటి పెద్దపెద్ద రియల్ ఎస్టేట్ సంస్థలు విల్లాలను నిర్మిస్తున్నారు. కొత్తగా అక్కడ ప్లాటింగ్ వచ్చింది. అత్తాపూర్‌లో పెద్దపెద్ద అపార్ట్మెంట్‌లు నిర్మిస్తున్నారు. గోల్డెన్ హైట్స్ కాలనీ, హ్యాపీ





రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఇంచార్జి ఏసీపీగా వికారాబాద్ నుంచి వచ్చిన సి.శ్రీధర్ డిప్యూటీ కమిషనర్ కె రవి కుమార్‌కు రిపోర్ట్ చేస్తున్న దృశ్యం

సి. శ్రీధర్

హెూమ్స్ కాలనీలలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణంలో ఉన్నాయి.

గగన్ పహాడ్ ఓ బడా రియల్ ఎస్టేట్ సంస్థ విల్లా లతో పాటు, అపార్ట్‌మెంట్‌లను నిర్మిస్తోంది. కాటేదాన్, టీఎన్జీవోస్ కాలనీ, శాస్త్రి పురం, సులేమాన్ నగర్ డివిజన్లలో సైతం బహుళ అంతస్తు భవనాలు నిర్మిస్తున్నారు. వీటన్నిటినీ పర్యవేక్షించాలంటే ఒక్కొక్క డివిజన్‌కు ఒక్కొక్క సెక్షన్ ఆఫీసర్ ఉండాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో గ్రేటర్ అధికారులు రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లాన్ విభాగానికి పూర్తిస్థాయిలో అధికారులను నియమించా లని ప్రజలు కోరుతున్నారు.





వివాహ వేడుకలలో కార్తీక్ రెడ్డి, శివ కార్తీక్ - మను శ్రీ (శిరీష) వివాహ వేడుకలకు హాజరైన బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, తదితరులు

## ఘనంగా శివ కార్తీక్ - మను శ్రీల వివాహ వేడుక

### హాజరైన పలువురు రాజకీయ నేతలు

**రాజేంద్రనగర్, ఆగస్టు18(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ వాస్తవ్యులు కొండమీది హరినాథ్ - పుష్పలతల కుమారుడు శివ కార్తీక్‌తో మణికొండ వాస్తవ్యులు పెంద్యాల సక్కుబాయి, కీర్తిశేషులు యాదయ్యల కుమార్తె మనుశ్రీల వివాహం ఆదివారం మొయినాబాద్ మండలం హిమాయత్ నగర్ ఎంకేపల్లి రోడ్డులో గల జేపి ఎల్ కన్వెన్షన్ లో ఘనంగా జరిగింది. వివాహ వేడుకలకు బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హాజరై వధూ వరులను ఆశీర్వదించారు.

ఆయనతోపాటు మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్, చెక్కల ఎల్లయ్య, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి , జాలిగం చిత్తారి, వివిధ పార్టీల నాయకులు నారగూడెం మల్లారెడ్డి , ఎం. కొమురయ్య, ఎస్. జయానంద్ రెడ్డి, డి.రమేష్ ముదిరాజ్, కాడెం సుధాకర్, జి.కరుణాకర్ రెడ్డి, సామాజిక కార్యకర్త మ్యాడం మధు సూదన్, రజక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**రంగారెడ్డి జిల్లాలో....**

రంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం జరిగిన వివాహ వేడుకల్లో పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు. వధూవరులను ఆశీర్వదించి, బంధువులకు బంధువులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733